సాక్షి
వికారాబాద్
మంగళవారం । 28 । జనవరి । 2025



సీపీఎస్‌ను రద్దు చేయండి

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 8లో▸



హెల్మెట్ తప్పనిసరి

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, ప్రాణాలకు హాని అని తాండూరు రూరల్ సీఐ నగేశ్ అన్నారు. 8లో▸



కొత్త లీడర్లకు కసరత్తు

స్వయం సహాయక సంఘాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు అధికారుల కసరత్తు మొదలైంది. 9లో▸

న్యూస్‌రీల్

రైతు భరోసా అమలు

8,609 మంది అన్నదాతల ఖాతాల్లో రూ.11.18 కోట్లు జమ

పరిగి: జిల్లాలోని 20 మండలాల్లో ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేసి సోమవారం రైతు భరోసా డబ్బులను ప్రభుత్వం విడుదల చేసింది. 20 గ్రామాల్లో 8,609 మంది రైతుల ఖాతాల్లో రూ.11.18 కోట్లు జమ చేశారు. మిగతా గ్రామాల్లో మంగళవారం నుంచి రెండో విడత రైతు భరోసా డబ్బులు జమ అవుతాయని అధికారులు తెలిపారు.

నేడు బంట్వారానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ రాక



బంట్వారం: మండలంలో మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సల్బత్తాపూర్, రొంపల్లి, బంట్వారం గ్రామాల్లో స్పీకర్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12గంటలకు జరిగే కార్యక్రమానికి అధికారులు, పార్టీ నాయకులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రజావాణికి 110 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

అనంతగిరి: ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో సకాలంలో పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అడిషనల్ కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 110 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, ఆర్‌డీఓ వాసుచంద్ర, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో యువకుడి సత్తా

రెండు పతకాలు సాధించిన డిగ్రీ విద్యార్థి



అభిషేక్‌ను అభినందిస్తున్న సంపత్‌కుమార్

తాండూరు టౌన్: తాండూరు పట్టణానికి చెందిన యువకుడు అభిషేక్ రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తా చాటాడు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 55 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. అలాగే బాడీ ఫిజిక్‌లో కాంస్య పతకం సాధించాడు. పట్టణంలోని శ్రీ కోటేశ్వర దేవస్థానంలో పూజారిగా పనిచేస్తున్న చంద్రశేఖర స్వామి, బసమ్మల కుమారుడు అభిషేక్ స్థానిక సింధూ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించిన అభిషేక్‌ను బీవీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీత, బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, రవి, మహేష్, సంజీవరావు, కొట్ల రాజ్‌కుమార్, పవన్, సందీప్ రెడ్డి, రాము, రమేష్, వెంకట్ తదితరులు అభినందించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్

కుల్కచర్ల: మండలంలోని దాస్యనాయక్ తండాలో ఫిబ్రవరి ఒకటిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం నగరంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి అజయ్ నాయక్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, రజిని సాయిచంద్, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల నాయకులు సుధాకర్ రెడ్డి, రాజశేఖర్, వెంకట్, రాజునాయక్, శంకర్ నాయక్, నర్సింలు, శివకుమార్ పాల్గొన్నారు.

పురం ఇక ప్రత్యేకం



తాండూరు మున్సిపల్ కార్యాలయం

ముగిసిన మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం

- జిల్లాలో నాలుగు పురపాలికలు
- అన్నింటి బాధ్యతలు ఒకే అధికారికి..
- ఇప్పటికే ముగిసిన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీ కాలం
- మేజర్ మున్సిపాలిటీల్లో కుమ్ములాటలకే పరిమితం

వికారాబాద్: మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. ఈ నెల 25తో పాలకవర్గం పదవీ కాలం పూర్తి కావడంతో ఆదివారం ప్రభుత్వం చైర్‌పర్సన్లు, చైర్మన్ల స్థానంలో ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 20 మండలాలు.. 585 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇప్పటికే సర్పంచులు, జిల్లా, మండల పరిషత్ సభ్యుల పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు స్థానిక సంస్థల్లో దేనికీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాలేదు. దీంతో మరికొంత కాలం జిల్లా మొత్తం ప్రత్యేకాధికారుల పాలనలో ఉండనుంది. ఎమ్మెల్యేలు మినహా అన్నింటా అధికారుల పాలనే కనిపించనుంది.

ఒక్క అధికారికే బాధ్యతలు

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఒకే అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం విస్మయానికి గురిచేస్తోంది. మిగతా జిల్లాల్లో ఒక్కో మున్సిపాలిటీకి ఒక్కో ప్రత్యేకాధికారిగా నియమించగా మన జిల్లాలో మాత్రం ఒకే అధికారికి నాలుగు మున్సిపాలిటీల బాధ్యతలు అప్పగించింది. జెడ్పీ సీఈఓగా విధులు నిర్వహిస్తున్న సుధీర్.. ఆ పదవితో పాటు రెండు అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు జెడ్పీ సీఈఓగా.. అదనపు కలెక్టర్‌గా.. వికారాబాద్ మండల పరిషత్ ప్రత్యేకాధికారి బాధ్యతలు నిర్వహిస్తూ వస్తున్నారు. తాజాగా మున్సిపాలిటీల పాలక మండళ్ల పదవీ కాలం పూర్తవటంతో వాటి బాధ్యతలు కూడా ఆయనకే అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన ఒక్కరే ఏడు బాధ్యతలు చేపట్టినట్టయ్యింది. ఇప్పటి వరకు ప్రభుత్వం ఏ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినా నాలుగు నియోజకవర్గాలకు జిల్లాలో ఉన్న నలుగురు ఉన్నతాధికారులను ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ వచ్చేది. ఇందులో వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ సుధీర్, కొడగంల్ మరో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్‌కలెక్టర్‌కు తాండూరు ప్రత్యేక అధికారిగా, వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర పరిగి నియోజకవర్గ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపడుతూ వస్తున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో నాలుగు మున్సిపాలిటీలకు వారినే ప్రత్యేకాధికారులుగా నియమిస్తారని అందరూ భావించారు. ఇందుకు విరుద్ధంగా జెడ్పీ సీఈఓ సుధీర్‌కు బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది.

అవిశ్వాసపు మంటలతో..

జిల్లాలో రెండు మేజర్ మున్సిపాలిటీలు వికారాబాద్, తాండూరు ఉండగా పరిగి, కొడంగల్ చిన్నవి. నాలుగింటా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారే చైర్‌పర్సన్లు, చైర్మన్లుగా ఉండేవారు. ఏడాది పాటు పాలన సవ్యంగా సాగింది. తర్వాత మేజర్ తాండూరు, వికారాబాద్‌లలో వర్గపోరు మొదలై పాలన పడకేసింది. వర్గపోరు కాస్త అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టడం, కోర్టులకు వెళ్లటం వరకు దారి తీసింది. వీరి పదవీ కాలం ముగిసే నాటికి బీఆర్‌ఎస్ తరఫున గెలిచిన నలుగురిలో ముగ్గురు కాంగ్రెస్ గూటికి చేరగా ఒక్క పరిగిలో మాత్రమే చివరి వరకు బీఆర్‌ఎస్ చైర్మన్ కొనసాగారు. ఈ కుమ్ములాటల నేపథ్యంలో పాలన మొత్తం గాడితప్పింది. ప్రభుత్వం ప్రతి మున్సిపాలిటీకీ ఒక్కో ప్రత్యేక అధికారిని నియమించి ఉంటే బాగుండేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల కాలంలో మున్సిపాలిటీలకు కొంత మేర నిధులు వచ్చాయని అధికార పార్టీ నేతలు చెబుతుండగా గత పర్యాయం మొత్తం నిధుల లేమితో అల్లాడిపోయాయి. పన్నుల వసూళ్లతోనే కాలం వెళ్లదీస్తూ వచ్చాయి. ప్రత్యేక అధికారుల పాలనలోనైనా ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాధ్యతల స్వీకరణ

అనంతగిరి: మున్సిపల్ పాలక మండలి కాల పరిమితి ముగియడంతో ప్రభుత్వం జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)సుధీర్‌ను నియమించింది. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సుధీర్



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా, సజావుగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఫిబ్రవరి 3 నుంచి 22వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. వృత్తి విద్య మొదటి సంవత్సరంలో 797 మంది, రెండో సంవత్సరంలో 1,336 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ఇంటర్ రెండో సంవత్సరంలో 3,782 మంది జనరల్‌కు సంబంధించిన విద్యార్థులు హాజరు కానున్నట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని ఆదేశించారు. పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులు, ఏఎన్‌ఎం, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెంటర్లలో ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకొని బస్సులను నడిచేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి ఎం.శంకర్ నాయక్, డీఈసీ నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ సురేష్, డీఎంహెచ్‌ఓ, విద్యుత్, ఆర్టీసీ, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

150వ వార్షికోత్సవానికి తరలిరండి

షాద్‌నగర్‌రూరల్: మొగిలిగిద్ద ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఎక్కడ, ఏ స్థాయిలో ఉన్నా 150వ వార్షికోత్సవానికి తరలిరావాలని పౌరహక్కుల సంఘం నేత, ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. పట్టణంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ చరిత్రలో 150 ఏళ్లు పూర్తి చేసుకున్న పాఠశాలల్లో మొగిలిగిద్ద 4వ స్థానంలో ఉందని అన్నారు. 150 వసంతాల వేడుకలకు ఈ నెల 31న సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. పూర్వ విద్యార్థులతో పాటు పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్యానికి ముందుగానే 1873లో ఏర్పాటు చేసిన మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాలకు ఎంతో గొప్ప చరిత్ర ఉందన్నారు. మాజీ సీఎం బూర్గుల రామకృష్ణారావు, మాజీ గవర్నర్ సత్యనారాయణరెడ్డి, రిటైర్డ్ ట్రాన్స్‌కో ఎస్‌ఈ మహాత్మారెడ్డివంటి వారు ఎందరో ఇక్కడి పాఠశాలలో చదివినవారేనని గుర్తు చేశారు. సమావేశంలో పాఠశాల పూర్వ విద్యార్థులు మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేణుగోపాల్, విద్యుత్‌శాఖ మాజీ ఎస్‌ఈ మహాత్మారెడ్డి, చార్టెడ్ అకౌంటెంట్ మల్లికార్జున్, ప్రొఫెసర్ వనమాల, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరగోపాల్



మున్సిపల్ మాజీ పాలకవర్గాన్ని సన్మానించిన అధికారులు

ప్రజాసేవ సంతృప్తినిచ్చింది

- మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మంజుల

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో సోమవారం అధికారులు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ చైర్‌పర్సన్ మంజుల రమేష్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఐదేళ్లు విజయవంతంగా పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మాజీ కౌన్సిలర్లు వారివారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మాజీ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

రోలును తిరగేసి.. పాత్రంతో పొడిచేసి!

- భార్య ఎముకలు మాయం చేసేందుకు గురుమూర్తి చేసింది ఇదే..
- ‘మీర్‌పేట’ మర్డర్ కేసులో వెలుగులోకి వస్తున్న కీలకాంశాలు

సాక్షి, సిటీబ్యూరో: ‘భార్యను చంపి, ఉడకబెట్టిన’ కేసులో కొత్త అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితుడు గురుమూర్తి భార్య మృతదేహాన్ని ముక్కలు చేశాక..ఉడకబెట్టడానికి కాస్టిక్ సోడాను, ఎముకలను పొడి చేయడానికి రోలు, పాత్రం వినియోగించాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్టు తెలిసింది. భార్యను చంపిన తర్వాత మృతదేహాన్ని మాయం చేయడానికి ఓ సినిమాతోపాటు ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేయడం ద్వారా లభించిన వీడియోలను చూసి ఈ ప్లాన్ అమలు చేశాడని గుర్తించినట్టు సమాచారం. ఆ రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఇదే పనిలో ఉన్నాడని తేల్చినట్టు తెలిసింది. రాచకొండ పోలీసు కమిషనరేట్‌లోని మీర్‌పేట పరిధి జిల్లెలగూడలో జరిగిన వెంకట మాధవి హత్య కేసులో పోలీసులు ఒక్కో చిక్కుముడి విప్పుతున్నారు. ఆధారాలు సేకరించడానికి ఉన్న అవకాశాలపై దృష్టి పెట్టారు. దేశవ్యాప్తంగా ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు.

బయటికెళ్లి సామగ్రి కొనుక్కొచ్చి..

ఈ నెల 14న రాత్రి గొడవ జరగడంతో గురుమూర్తి మాధవి తలను బలంగా గోడకేసి కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి, కాసేపటికే మరణించింది. గురుమూర్తి మరుసటి రోజున ఐదుసార్లు ఇంట్లోంచి బయటికి వెళ్లి వచ్చినట్టు సీసీ కెమెరాల్లో రికార్డయింది. అలా వెళ్లి వస్తూ మాంసం కొట్టే మొద్దు, కత్తి, కాస్టిక్ సోడా, కొత్త వాటర్ హీటర్ కొనుక్కువచ్చినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని బాత్‌రూమ్‌లోకి లాక్కుపోయిన గురుమూర్తి..అక్కడే మాంసం కొట్టే మొద్దుపై కత్తితో ముక్కలు చేశాడు. పెద్ద బకెట్‌లో హీటర్ పెట్టి నీళ్లు మరిగిన తర్వాత ముక్కల్ని అందులో వేశాడు. మాంసం పూర్తిగా ఉడికిపోయి విడిపోవడానికి అందులో కాస్టిక్ సోడా కలిపి ఉంటాడని.. ఉడికిపోయాక కమోడ్‌లో వేసి ఫ్లష్ చేసి ఉంటాడని ఫోరెన్సిక్ నిపుణులు చెప్తున్నారు. ఇక ఎముకలను స్టవ్ మీద పెట్టి కాల్చి.. తర్వాత రోలుపై పెట్టి పాత్రంతో కొట్టి పొడిగా మార్చాడని పోలీసులు నిర్ధారించినట్టు తెలిసింది. తర్వాత ఎముకల పొడి, కత్తిని జిల్లెలగూడ చెరువులో పారేసినట్టు సమాచారం. మృతదేహాన్ని మాయం చేయడం పూర్తయ్యాక ఆధారాలేవీ చిక్కకుండా రోలు, పాత్రం, మొద్దును, బాత్‌రూమ్‌ను పలు మార్లు కడిగేశాడని...పదే పదే నీటిని ఫ్లష్ చేస్తూ డ్రైనేజీలోనూ ఎలాంటి ఆనవాళ్లు మిగలకుండా చేశాడని పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. అయితే ఫోరెన్సిక్ నిపుణులు స్టవ్‌పై చిన్న మాంసం ముక్క, వెంట్రుకలతోపాటు మాధవి తలను గోడకు కొట్టిన చోట రక్తపు మరకల్ని గుర్తించారని..డీఎన్‌ఏ పరీక్షలు చేయించాలని నిర్ణయించారని సమాచారం.

అధికం.. అనర్థం



దుద్యాల్ మండలంలో వరినాట్లు వేస్తున్న రైతులు, కూలీలు

పంటల సాగులో అధిక యూరియా ముప్పే

- వరిలో వృథా ఖర్చులు తగ్గించుకోవాలి
- సూచనలు పాటిస్తే అధిక లాభాలు:
- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

దుద్యాల్: పంటల సాగులో అధికంగా యూరియా వాడితే అనర్థమే అని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. సాధ్యమైనంత వరకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వరి సాగులో వృథా ఖర్చులు తగ్గించుకుంటే మంచిదన్నారు.

పైరు దశలో నత్రజని అవసరం

వరి పైరు ఏపుగా పెరగడానికి, అధిక పిలకలతో దుబ్బు చేయడానికి, వెన్నులు బాగా రావడానికి నత్రజని చాలా అవసరం. దుక్కిలో పిలకలు పెట్టే దశలో, చిరుపొట్ట దశలో రకాన్ని బట్టి ఎకరాకు ఒక సారికి 35 కిలోల నుంచి 45 కిలోల వరకు యూరియా వేసుకోవచ్చు. కానీ కొంతమంది రైతులు పిలకల దశలో అంటే వరి నాటిన రెండు నుంచి మూడు వారాల వ్యవధిలో మోతాదుకు మించి యూరియా వాడుతున్నారు. ఇలా చేయడం ద్వారా పంటకు మేలు కంటే కీడు అధికంగా ఉంటుంది. యూరియా అధికంగా వాడితే ఆకు రంగు పచ్చగా మారి చీడ పీడలకు గురయ్యే అవకాశం అధికంగా ఉంటుంది. పైరుకు వాడిన యూరియాలో మొక్క 30 నుంచి 35 శాతం వరకు మాత్రమే వినియోగించుకుంటుంది. మిగతాది వృథా అవుతుంది.

దుక్కిలో కాంప్లెక్స్ వద్దు

వరి పిలకల దశలో యూరియాతో పాటు చాలా మంది రైతులు డీఏపీ, 20-20-0 వంటి కాంప్లెక్స్ ఎరువులను ఎకరాకు ఒక బస్తా చొప్పున వేస్తుంటారు. కాంప్లెక్స్ ఎరువుల్లో ఉండే భాస్వరం కేవలం 20 నుంచి 25 శాతం మాత్రమే మొక్కకు అందుతుంది. మిగతాది అంతా భూమిలో కలిసిపోయి వృథా అవుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్నాం



వరితో పాటు ఇతర పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. చాలా మంది రైతులు యూరియా అధికంగా వాడుతున్నారు. దీంతో నష్టాలే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. సేంద్రియ ఎరువులు వినియోగిస్తే మంచిది. భూములకు రక్షణతో పాటు ప్రజల ఆరోగ్యానికి హాని ఉండదు. యూరియా వాడకంపై వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు అధికారుల సూచనలు పాటించాలి.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

వార్షిక పరీక్షలపై దృష్టి పెట్టండి

- ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేయాలి
- ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి
- అధికారులకు రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి సూచన



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 51, ఇతర విభాగాలకు సంబంధించి 16 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆయా విభాగాల అధికారులు కృషి చేయాలని అన్నారు. ప్రజల నుంచి అందే అర్జీల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు పథకాల వివరాలను గ్రామ పంచాయతీ/ మున్సిపాలిటీ వార్డుల వారీగా నమోదు చేయాలని సూచించారు. టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల కోసం విద్యార్థులను సంసిద్ధులను చేయాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహాదేవుడికి పంచామృతాభిషేకం



స్వామివారికి అభిషేకం చేస్తున్న మాలధారణ స్వాములు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో సోమవారం దేశ్‌ముఖ్ కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాలధారణ స్వాములు శివలింగానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. పార్వతమ్మ దేశ్‌ముఖ్ జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు శివస్వాములకు భిక్ష ఏర్పాటుచేశారు.

'వేయి గొంతులు-లక్ష డప్పులు'జయప్రదం చేద్దాం

ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ



అభివాదం చేస్తున్న నాయకులు

అనంతగిరి: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వేయి గొంతులు-లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ అన్నారు. ఆదివారం రాత్రి వికారాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ల వర్గీకరణకు అడ్డుపడితే చూస్తే ఊరుకునేది లేదన్నారు. ఫిబ్రవరి 7న నిర్వహించే కార్యక్రమానికి ప్రతీ మాదిగ బిడ్డ డప్పు సంకన వేసుకొని రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కద్మూరి ఆనందం, రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి సుభాష్, ఎంఎస్‌పీ నాయకులు స్వామిదాసు, కృష్ణ, నర్సింలు, డప్పు మహేందర్, ప్రకాష్, అంజి, మల్కప్ప, జగన్, అన్నపూర్ణ, పుష్పారాణి, మాధవి, సంతోష, వెంకటయ్య, అశోక్, జగదీష్, ఆశన్న, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీ

నెల రోజులుగా పట్టించుకోని అధికారులు



భగీరథ పైప్‌లైన్ లీకేజీని చూపుతున్న గ్రామస్తులు

బొంరాస్‌పేట: మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలోని రేగడిమైలారంలో జాతీయ రహదారి 163పై నెల రోజుల క్రితం భగీరథ పైప్‌లైన్ లీకేజీ ఏర్పడి రహదారి పొడవునా నీరు పారుతోంది. దీంతో రాకపోకలకు సమస్యగా మారిందని గ్రామస్తులు, వాహనదారులు వాపోతున్నారు. రోడ్లు బురదమయంగా మారి దోమలు సమస్య ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంపీడీఓ కార్యాలయ ఆకస్మిక తనిఖీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని సోమవారం జిల్లా పరిషత్ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగానే కార్యాలయానికి వచ్చి ఫైల్స్, రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమ్మ, సూపరింటెండెంట్ ఎల్లంకి జంగయ్య, సిబ్బంది ఉన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

వికారాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మంజుల



అనంతగిరి: అందరి సహకారంతో వికారాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి పనిచేశానని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్‌కుమార్ అన్నారు. పురపాలిక అభివృద్ధికి రూ.119 కోట్ల నిధులు వెచ్చించాం. తాను బాధ్యతలు స్వీకరించిన నెలలోనే కోవిడ్ విజృంభించడంతో అధికారులతో సమన్వయం చేసుకుంటూ కోవిడ్ ఆంక్షలను పాటిస్తూ ప్రజలకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టాం. ప్రజలు ఎక్కడ కనిపించినా మా చైర్మన్ అమ్మా అంటూ ఆప్యాయంగా పలకరించారు. జిల్లా కేంద్రమైన వికారాబాద్‌కు వచ్చిన కలెక్టర్లు, ప్రత్యేకాధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, పట్టణ ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించినందున మంచి పేరు తీసుకువచ్చాం. ప్రజా ఫిర్యాదులను గంటల సమయంలోనే పరిష్కరించాం. అదంతా మున్సిపల్ సిబ్బంది గొప్పతనమే. ఐదేళ్ల పాలన సమష్టి కృషితో సాధ్యమైంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరాం. ఆయన ఇచ్చిన మాట ప్రకారం మున్సిపల్ అభివృద్ధికి రూ.80 కోట్లు విడుదల చేయించారన్నారు. భవిష్యత్తులో రాజకీయాల్లోనే కొనసాగుతానని, స్పీకర్ ప్రసాద్ అన్న మాటకు జవదాటేది లేదన్నారు. ఇటు చైర్‌పర్సన్‌గా, అటు మున్సిపల్ చైర్‌పర్సన్స్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పనిచేయడంతో రాష్ట్ర స్థాయిలో ఎన్నో విషయాలను చర్చించాం అన్నారు.

మున్సిపల్ పాలకవర్గాల గడువు ఈ నెల 26తో ముగిసింది. తమ పదవీ కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు సంతృప్తినిచ్చాయని, ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టమని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్లు అన్నారు. ప్రజల సహకారంతోనే పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటు తర్వాత స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నిధుల మంజూరుకు ఎంతో సహకరించారని చెప్పారు. 'సాక్షి'తో తమ అనుభవాలను పంచుకున్నారు..

సాక్షి ప్రత్యేకం

ఐదేళ్ల కాలం.. యాభై ఏళ్ల అనుభవం

తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్



తాండూరు: మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన ఐదేళ్ల పదవీకాలం తనకు యాభై ఏళ్ల రాజకీయ అనుభవం నేర్పిందని మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి విజన్‌తో పనిచేయాలనుకున్నా. కానీ సొంత పార్టీలో ఓ వర్గం వారు ప్రతిపక్షాలతో జతకట్టి అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకున్నారు. తన అధికారాలను సైతం హరించారు. పదవి నుంచి తప్పించేందుకు నాలుగేళ్లు వారు చేయని ప్రయత్నం లేదు. మున్సిపాలిటీకి కమిషనర్‌ను రాకుండా చేసి ఇన్‌చార్జి కమిషనర్‌గా ఆర్డీఓ అశోక్‌కుమార్‌కు బాధ్యతలు కట్టబెట్టారు. ఆయన కౌన్సిలర్ల మధ్య గొడవలు సృష్టించి వ్యవస్థను భ్రష్టుపట్టించారు. తన భర్త పరిమళ్‌గుప్తాపై అక్రమ కేసులు పెట్టినా బెదరలేదు. ఉన్నత కుటుంబం నుంచి వచ్చిన తాము రాజకీయాల్లోకి వచ్చి ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడ్డామన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో ఏడాది కాలంగా ఎలాంటి గొడవలు లేకుండా పురపాలికలో పౌరసేవలు చేసే అవకాశం దక్కిందన్నారు. తనను ఇబ్బంది పెట్టిన వారికి భవిష్యత్‌లో ప్రజలే ఓటుతో గుణపాఠం చెబుతారన్నారు. తాండూరు మున్సిపల్ ప్రజల ఆశీర్వాదం, ఆ దేవుడి దయ ఉంటే భవిష్యత్‌లో ప్రజలకు సేవ చేసేందుకు వెనుకాడనన్నారు.

పట్టపగలే చోరీ

ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహరణ



దుండగులు ధ్వంసం చేసిన బీరువా

పరిగి: పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ ఘటన సోమవారం పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పట్టణ కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన సత్తయ్య స్క్రాప్ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉదయం ఆయన షాప్‌నకు వెళ్లిన తర్వాత మధ్యాహ్నం గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని ఐదు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. గమనించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పావురాల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

పరిగి: పావురాల వేటకు వెళ్లిన వ్యక్తి బావిలోపడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోశ్‌కుమార్, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. ఉదాంద్ర సుభాన్(45) వేరుశనగ పంట సాగు చేశాడు. రోజు మాదిరిగానే ఈ నెల 25న రాత్రి భోజనం చేసి పంట కావలికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం సుభాన్ ఇంటి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం గ్రామస్తులు ఓ బావిగట్టుపై చెప్పులు, టార్చి ఉండడం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనుమానంతో గ్రామస్తులు బావిలో గాలించగా సుభాన్ మృతదేహం లభ్యమైంది. బావి గూళ్లలో ఉన్న పావురాలను పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి బురదలో చిక్కుకుని మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య రమాదేవి ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



సుభాన్(ఫైల్)

హెల్మెట్ తప్పనిసరి

తాండూరు రూరల్ సీఐ నగేశ్

యాలాల: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని తాండూరు రూరల్ సీఐ నగేశ్ అన్నారు. సోమవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసు కళాజాత బృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రిబుల్ రైడింగ్, డ్రంకెన్ డ్రైవ్, రాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. డ్రగ్స్, సైబర్ క్రైమ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లైసెన్సు, వాహనాల పత్రాలు లేకుండా రోడ్లపైకి వస్తే జరిమానా విధిస్తామన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యాలాల ఎస్ఐ గిరి, కానిస్టేబుళ్లు నరేశ్, బలరాం, జిల్లా కళాజాత బృందం సభ్యులు ఉన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

ఏసీపీ రంగస్వామి



లాడ్జీలో తనిఖీలు చేపడుతున్న ఏసీపీ రంగస్వామి, పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఏసీపీ రంగస్వామి అన్నారు. సోమవారం పట్టణంలోని లాడ్జీలపై ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో పోలీసుల దాడులు నిర్వహించారు. లాడ్జీలకు సరైన వసతులు ఉన్నాయా, ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ.. పట్టణంలోని అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా లాడ్జీలలో తనిఖీలను చేపట్టామన్నారు. లాడ్జీల యజమానులకు అనుమతులు తప్పనిసరి. లాడ్జీలకు వచ్చే వారి పూర్తి సమాచారాన్ని తీసుకోవాలని.. ఎలాంటి ఘటనలు చోటుచేసుకున్నా లాడ్జీ యజమానులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. లాడ్జీకి వచ్చే వారు గదిలో ఉన్నారా? చెప్పకుండా ఖాళీ చేసి వెళ్లిపోయారా అనే విషయాలను ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. సీసీ కెమెరాలను తప్పక ఏర్పాటు చేసుకోవాలని, లాడ్జీలలో జరుగుతున్న విషయాలను గమనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐలు బలరాం, సుశీల, పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ

- నిందితుడిని పట్టించిన సెల్‌ఫోన్ సిగ్నల్స్
- వివరాలు వెల్లడించిన మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్ రూరల్: మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ ఓఆర్ఆర్ వద్ద జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు గురైన మహిళ నిజామాబాద్ జిల్లా భోదన్‌కు చెందిన శివానంద(45)గా గుర్తించారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు. శివానంద(45)భర్త సాయిలుతో గొడవపడి కుటుంబానికి దూరంగా ఉంటోంది. ప్రస్తుతం కొంపల్లిలో నివాసం ఉంటుంది. మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇదిలా ఉండగా కరీంనగర్ జిల్లా కమలాపూర్‌కు చెందిన షేక్ ఇమామ్ (37)సిటీకి వచ్చి మేడ్చల్‌బస్ స్టాప్ వద్ద శివానందను చూసి మాటలు కలిపాడు. అనంతరం ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై మునీరాబాద్ గ్రామ శివార్లలో నిర్మానుష్య ప్రదేశమైన ఓఆర్ఆర్ కల్వర్టు కిందకు వెళ్లారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యా డబ్బువిషయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో షేక్ ఇమామ్ మృతురాలు శివనంద గొంతును నులుమడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. పక్కనే ఉన్న బండరాయితో తలపై కొట్టడంతో మరణించింది. అనంతరం నిందితుడు మునీరాబాద్ వెళ్లి పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొనుగోలు చేసి తిరిగి ఘటనా స్థలికి వచ్చాడు. మృతురాలిపై పెట్రోల్ పోసి నిప్పంటించి పరారయ్యాడు. ఈ నెల 24న సాయంత్రం మేడ్చల్ పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని పలు ఆధారాలు సేకరించారు. మెట్టెల ఆధారంగా మృతురాలు వివాహితగా గుర్తించారు.

నోటీసులతో వీడిన మిస్టరీ..

హత్య కేసులో గుర్తు తెలియని మహిళ హత్యకు గురైనట్లు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి చేతులపై ముగ్గురి పేర్లున్న పచ్చబొట్టు ఉండడంతో జిల్లాల్లోని పలు పోలీస్ స్టేషన్లకు పంపించారు. ఈ విషయం తెలుసుకున్న శివానంద కుటుంబసభ్యులు పోలీసులను సంప్రదించారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడు షేక్ ఇమామ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

బాలికల భద్రతకే షీ టీమ్స్

విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ఉండాలి

- ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం రూరల్: బాలికల భద్రతకే షీ టీమ్స్ పనిచేస్తాయని.. విద్యార్థినులు ఆత్మ విశ్వాసంతో ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. మండల పరిధిలోని మంగళ్‌పల్లి గేట్ వద్ద సోమవారం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో సమావేశమయ్యారు. డయల్ 100, షీటీమ్స్, డ్రగ్స్, సోషల్ మీడియాపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డ్రగ్స్ వాడకం, పోకిరీల వేధింపులు, ర్యాగింగ్ వంటి సంఘటనలు జరిగితే వెంటనే 100 నంబర్‌కు ఫోను చేసి సమాచారం అందించాలని సూచించారు. నేరం జరిగినప్పుడు మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే 100, 1930, 8712662111 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మధు, ఎస్ఐలు రామకృష్ణ శిరీష, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న చలో భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇబ్రహీంపట్నం హెచ్ఆర్డీ పాఠశాలలో క్రీడోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి క్రీడలపై అవగాహన ఉండాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. యువత దేశానికి పట్టుకొమ్మలని.. చెడు దారిల్లో నడిస్తే దేశానికే ముప్పుగా మారుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పృథ్వీ, శివకృష్ణ, జగదీశ్, పవన్, మహేందర్, నవీన్, చరణ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడలో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

కొందుర్గు: చౌదరిగూడ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గూడ నారాయణ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో ఫంక్షన్ కోసం మరో గ్రామానికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చే వరకు ఇంటి గడియలు విరగ్గొట్టి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో బీరువాను తెరిచి చూడగా రూ.45వేల నగదు, మూడు తులాల బంగారు, 25 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. నారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వర్లు, క్లూస్‌టీం ఘటనా స్థలిని పరిశీలించి ఆధారాలు సేకరించారు.

వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

మణికొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నార్సింగి పోలీసులు తెలిపిన ప్రకారం.. కోకాపేట టోల్‌గేట్ నుంచి ఐఎస్‌బీ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని బైక్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో అతని తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతి చెందిన వ్యక్తి జీన్స్ పాయింట్, టీ షర్ట్ ధరించి తెల్లటి గడ్డం, మీసాలతో ఉన్నాడన్నారు. అతనికి సంబంధించిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

నందిగామ: మూడేళ్ల బాలుడు నీటి సంపులో పడి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని జంగోనిగూడ ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. బీహార్‌కు చెందిన సిమ్మని కుమార్ స్థానికంగా ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ జంగోనిగూడలో అద్దె ఇంట్లో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం కుమార్ విధులకు వెళ్లగా భార్య ఇంట్లో పనులు చేసుకుంటోంది. ఈ సమయంలో బాలుడు ఆయుశ్(3) ఆడుకుంటూ బయటకు వెళ్లాడు. వీరి ఇంటి పక్కనే నిర్మాణం చేపట్టిన ఓ ఇంటి ఎదుట ఉన్న నీటి సంపులో పడిపోయాడు. కాసేపటికి గమనించిన తల్లి కుమారుడి కోసం వెతకారు. పక్కనే ఉన్న సంపులో పరిశీలించగా బాలుడు కనిపించాడు. వెంటనే బయటకు తీసి షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. బాలుడి తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయండి

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

ధారూరు: సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సంఘం మండల నాయకులతో కలిసి సోమవారం తహసీల్దార్ సాజిదాబేగంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశపెడుతున్న ఏకీకృత పెన్షన్ పథకంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రస్తుత సీపీఎస్‌తో రెండు లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు శాపంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రవీందర్‌రెడ్డి, మాణిక్యం, గుణవంత్‌రెడ్డి, అంబిక, శ్రీలత, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ సాజిదాబేగంకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ సంఘం నాయకులు

సంపూర్ణ మద్యపాన నిషేధానికి అడుగులు

- ఎన్నికల వేళ మద్యం పంచితే రూ.4 లక్షలు
- విక్రయిస్తే రూ.40 వేలు, కొన్నవారికి రూ.20 వేల జరిమానా
- తీర్మాన పత్రాన్ని సీఐ విజయ్‌కుమార్‌కు అందజేసిన ఉప్పరిగడ్డా తండావాసులు

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల సమయంలో మద్యం పంచినా, అమ్మినా, కొన్నా జరిమానా విధిస్తామని ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డతండా వాసులు సోమవారం తీర్మానం చేసుకున్నారు. అనంతరం ఈ తీర్మాన పత్రాన్ని పట్టణ సీఐ విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఎన్నికల్లో మద్యం పంచితే రూ.4లక్షలు, అమ్మితే రూ.40వేలు, కొన్నవారికి రూ.20వేల జరిమానా విధిస్తామన్నారు. మద్యం పంచుతున్న, అమ్ముతున్న సమాచారాన్ని గ్రామస్తులకు తెలిపే వారికి రూ.పదివేల నజరానా అందిస్తామన్నారు. గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని తీసుకువచ్చేందుకు ఈ నిర్ణయాన్ని తీసుకున్నామన్నారు. ఇందుకు పంచాయతీ పరిధిలోని తండావాసులు సహకరించాలని కోరారు.



తీర్మాన పత్రాన్ని సీఐ విజయ్‌కుమార్‌కు అందజేస్తున్న గ్రామస్తులు

'స్కాలర్స్' టీచర్‌కు సావిత్రీబాయి పూలే అవార్డు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ తెలుగు హెచ్‌ఓడీ చతుర్వేదుల దుర్గాదేవికి ప్రతిష్టాత్మక సావిత్రీబాయి పూలే జాతీయ అవార్డు లభించింది. దాంతో సోమవారం స్కూల్ ప్రిన్సిపాల్ శిల్పారెడ్డి, చైర్మన్ శ్రీధర్‌రెడ్డిలు ఆమెను అభినందించారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన ఆమెను గుర్తించి సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ ఇటీవల అవార్డును అందించటం గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం స్కాలర్స్ స్కూల్ యాజమాన్యంతో పాటు వైస్ ప్రిన్సిపాల్ ఉషాతన్మయ్, తోటి ఉపాధ్యాయులు అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉత్తమ అవార్డులను అందుకోవాలని ఆకాంక్షించారు.

ఉత్తమ సేవలకు అవార్డులు

అనంతగిరి: జిల్లా ఎక్సైజ్ శాఖలో ఉత్తమ సేవలందించిన అధికారులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ శాఖ డీఐజీ కమలాసన్‌రెడ్డి ప్రత్యేక ప్రశంసాపత్రాలు అందజేశారు. నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారంలో ఉత్తమ ప్రతిభ కనబరిచన అధికారులకు అవార్డులు అందజేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్‌తో పాటు, సీఐ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ రాథోడ్, నిజాం, విష్ణు వర్ధన్‌రెడ్డి, కానిస్టేబుల్ హనుమంతు ప్రశాంసాపత్రాలు అందుకున్నారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న విజయ్‌భాస్కర్